

# వెలుగుకాని చీకటి

కె.వి.యస్. నరసింహశాస్త్రి

వ్యభిచారిణుల వెనకటి కథలన్నీ ఒకేలా ఉంటాయనుకుంటా.

ఎందుకంటే నేను చదివిన అన్ని కథల్లోనూ దాదాపు ఒకే కథనం నడిచింది పెళ్లి కాకో, మొగుడు సరిగా మాడకో బయటపడి. ప్రపంచంలో మునిగి సానికొంపల్లో తేలుతారు. అనేకమంది రచయితలు వాళ్ళ కొంపల్లోకి పోయి (కథల్లో మాత్రం) వాళ్ల వెనకటి కథలు తెలుసుకుని జాలిపడ్డవాళ్లున్నారు. పెళ్ళి చేసుకున్నవారున్నారు. ఆశ్చర్యం ఏమిటంటే ప్రతి రచయితకు తన కథ చెప్పేస్తుందా సుందరి. కొంత

మంది విషాదంగా 'మా గతి ఇంతే' అంటూ ఉంటారు. అప్పుడు రచయిత లోకాన్ని, లోకాన్ని పుట్టించినవాణ్ణి, వాడి బాబుని ఏక బిగిన ఏకేస్తూ అడ పాఠకజనాన్ని దుఃఖ సముద్రంలోకీ, యువ పాఠకజనాన్ని ఆవేశ సముద్రంలోకీ తోసేసి ఒడ్డున కూర్చుని వింత జూస్తుంటాడు.

నా కల్లాంటి కోరికలు లేవు.

•

ఆరోజు నేను రెండో ఆట చూసి వస్తున్నాను. ఆ థియేటర్ వెనక సందు చీకటి బజారు. ఆ బజారులో ట్యూబ్‌లైట్లు తక్కువగా ఉంటాయి, చీకటిని ప్రోత్స హించటానికేమో! వరసగా గుడిసెలు. అటు పక్కన కాలువ. పది గజాలకో సారా కొట్టు, సాయంత్రం అవగానే వెలుస్తాయి ఇంకా చాలా చిల్లరకొట్లు.

రష్‌గా ఉండటంచేత థియేటర్ వెనక గేటు తెరవటంతో ఆ సందున రావటం తప్పనిసరి అయింది. వడివడిగా నడిచి వచ్చేస్తున్నాను.

"బాబూ కొత్తపిట్ట వచ్చింది."

"పదహారేళ్ళ పడుచుపిల్ల బాబూ."

"చెంగావి రంగు చీర కట్టుకున్న చిన్నదీ. దాని అందమంతా 'చీర' లోనే ఉన్నది."

"ఎందుకొచ్చిందోయ్ మామా."

"రండి బాబూ మాట."

వాళ్ళ పిలుపులు, పాటలు చెవిలో హోరెత్తిస్తున్నాయి. ఆ బజారున వచ్చే వాళ్లకి ఆ పిలుపులు, పాటలు కొత్త కాక పోయినా ఒక్కోసారి ఒక్కో రకంగా ఉంటుంది.

తల వంచుకు వస్తున్న నాకు ఏదో చెయ్యి పట్టుకున్నట్టయి పక్కకి చూశాను.

ఎవరో అమ్మాయి! అలంకారం అధికం కావటంతో ముఖం వెలవెల పోతోంది.

'రండి బాబు' అంది దీనంగా.

ఆ కళ్లలోని దీనత్వాన్ని ఎక్కువసేపు చూడలేకపోయాను. నా గుండెల నిండా జాలి నిండి పోయింది.

నా తటపటాయించటం చూసి మరో సారి 'రండి బాబు' అంది కొద్ది హాయ లుతో.

ఎందుకో ఆమెను అనుసరించా లని పించింది.

"జాగ్రత్త బాబూ, తల వంచండి" అంది గుడిసెలోకి దారితీస్తూ.

ఆ గుడిసెలో ఓ గుడ్డి దీపం వెలుగు తోంది.

అటు పక్కన ఓ మంచం ఉంది. మంచం నిండా ఏవో వాసన విరజిమ్మే పూలు.

నన్ను ఆ మంచంపై కూర్చోమంది. తనిప్పుడే వస్తానని చెప్పింది.

ఆ చుట్టుపక్కలా కలయచూడ్డావి కక్కడ ఏం లేవు.

ఆమె మళ్ళీ వచ్చింది చీర మార్చు కున్నట్లుంది.

ఆమె దగ్గరగా వచ్చింది.

నేను లేచి నుంచున్నాను.

దగ్గరకు వచ్చి చెయ్యి పట్టుకో పోయింది.

"ఆగు" అన్నాన్నేను.

ఏమిటన్నట్లు చూసింది.

"నాకు నువ్వేమీ ఇవ్వక్కరలేదు గాని,

నీ కెంత కావాలో చెప్పు" అన్నాను.

అనటంకూడ కాస్త కరినంగా అన్న ట్లున్నాను.

అంత గుడ్డి వెలుతురులోనూ ఆమె ముఖం మారటం గమనించాను.

"అదేమిటి బాబూ, నా దగ్గరనుంచీ ఏమీ తీసుకోకుండానే డబ్బెలా ఇస్తారు? అది తప్పు కదా బాబూ."

"అది తప్పని తెలుసుండి కూడ ఈ తప్పు ఎందుకు చేస్తున్నావ్?"

"అట్టా అడుగుతారేమిటి బాబూ, మీకేమి తెలియనట్టు."

"అవును నాకేమీ తెలియదు. నీ పేరేమిటి?"

"సావిత్రి బాబూ."

"ఇక్కడందరి పేర్లు సీత, అనసూయ, అరుంధతి అని ఉంటాయని విన్నాన్లే" వెటకారంగా అన్నాను.

"పేమంటే మీ కెందు కంత కసి బాబూ? మా జీవితా లెంత మలినమై పోయినా మాకూ ఉంది బాబూ మనసు, ఏ క్షణాని కా క్షణం గడచిందే చాలు ననుకునే జీవితాలా మావి."

"అయితే సావిత్రీ, నువ్వేమన్నా చదువుకున్నావా?"

"ఏదో చదువుకున్నాలే బాబూ."

"మరి . ఈ మాటలు...."

"నాలుగురోజు లిక్కడ ఉంటే కొన్ని పోకిరి మాటలు, కొన్ని ఈ మాటలు వస్తాయి బాబూ. మొదటివి రసికుల్ని రంజింప జేయటానికీ, రెండోవి మీలాంటి వాళ్ళని కరగించటానికీ."

"ఉన్న విషయాన్ని ఉన్నట్లు చెప్పావు, థాంక్స్. నీ వెనకటి జీవితాన్ని నే నడగ దలచుకోలేదు. ముందు జీవితానికో దారి చూపిస్తాను, వస్తావా."

"వద్దు బాబూ, ఓసా రిలాగే ఒకాయన పెళ్ళి చేసుకుంటానని తీసుకుపోయి రెండు నెలలు పోయాక ఇక్కడ దింపి వెళ్లాడు."

"ఛీ. నిన్ను పెళ్ళి చేసుకోటానికి కాదు. నాతో రమ్మంటా నీకు పని పాటలు వచ్చా."

"ఏం బాబు? బాగానే వచ్చు."

"మా ఇంట్లో పని చేస్తావా?"

"మీ ఇంట్లోనా. ఇది వదిలేసి రమ్మం టారా? ఎప్పుడు బాబు? ఎప్పుడు రాను? ఇప్పుడే వెడదామా?"

"అవునూ నువ్విక్కడ ఎవరితోనూ చెప్పక్కర లేదా? మీ గుంపుకి మేనేజ రెవరూ లేరా? (కొన్ని కథల్లో చదివాను. రంగమ్మో, కనకమ్మో కంపెనీ మేనేజరనీ, కింద కొందరు రౌడీలుంటారూ అవటా అనీ.)

"లేరు బాబూ, ఎవరి తిండి వాళ్ళదే. కాకపోతే హొయలుతో పెద్దోళ్ళని వశ పర్చుకుని కార్లంట తిరిగే ఆ డాబా యింట్లో లేరూ, వాళ్ళప్పుడప్పుడూ జాలి చూపిస్తుంటారు మా మీద."

"సరే. సావిత్రీ, రేపు మధ్యాహ్నం నే నిక్కడికి వస్తాను. మా ఇల్లు చూపి స్తాను. సాయంత్రం పనిచేస్తానంటూ రా. మా అమ్మగార్నో, నాన్నగార్నో అడుగు. వాళ్ళని ఒప్పించి పనిలో కుదురు. పాత పనిమనిషి మానేసి పదిరోజు లయిందిట. నువ్వు నమ్మకంగా చెబితే వాళ్ళు వెంటనే ఒప్పుకుంటారు."

# ఆగండి! చదవండి! ఆలోచించండి!

సాహిత్యాభిలాషతో, విజ్ఞానాభిలాషతో మనము రకరకాల గ్రంథాలెన్నో చదువుతుంటాము. వందలకొద్దీ పేజీలున్న గ్రంథంలో నిజానికి మనని నిలబెట్టి ఆలోచింపజేసే భావాలు కేవలం కొన్ని వాక్యాలలో ఇమిడి వుంటాయి. ఏ పుస్తకంగానీ-మీరు చదువుతున్నప్పుడు అలా మిమ్మల్ని ఆలోచింపజేసిన వాక్యాలను సేకరించి మాకు పంపండి. మీతోటి పాఠకులకు వాటిని పై శీర్షిక ద్వారా అందజేస్తాము. ఇతరులకు పంచి ఇస్తే తరగకపోగా పెరిగి మనల్ని మరింత విజ్ఞుల్నిగా చేసేదే మరి విజ్ఞానం. (చూడండి పేజి 42)

---

నాకు ఒక వ్యభిచారిణిని పెళ్ళి చేసుకునేంతటి ధైర్యమూ, కరుణా, జాలీ లేవు. అందుకే పనిమనిషిగా కుదరమన్నాను.

"అలాగే బాబు." అంది సావిత్రి.

"మన రక్తం పంచుకున్న ఓ ఆడపడుచుకి, మనం జార విడుచుకున్న జాతి పరువు"కి పీడ కల్పించానన్న తృప్తి కలిగింది.

"ఇదుగో సావిత్రీ, ఇక్కడ నీకున్న అలవాట్లన్నీ మానుకోవాలి. గొప్ప లోగిళ్ళలో చాలా జాగ్రత్తగా మసలుకోవాలి సుమా" అన్నాను.

"నాకు తెలియదా బాబూ, మీ రింతగా చెప్పాలా? రేపు మీరు వస్తారుగా?"

"తప్పకుండా వెళ్తున్నాను సావిత్రీ" అంటూ ఐదురూపాయల కాగితం అందించాను.

తీసుకుని "దండాలు బాబూ" అంది.

అప్పుడు నేను సావిత్రి వంక చూళ్లేదు. చూస్తే ఆమె పొందుతున్న ఆనందం వంక చూపినట్లయ్యేది.

నేను బయటకు వచ్చి బయల్దేరాను.

*　　*　　*

"ఒరేయ్, ఇవాల్టినుంచి నాకు లేశైందని నామీద కస్సుమన్నావంటే ఊరుకోను. నిన్ననే కొత్త పనిమనిషి వచ్చి చేరింది. పేరు సావిత్రిట. అన్ని పనులు దానికి చెప్పి చేయించుకో" అంటూ నన్ను లేపింది అమ్మ.

నాకూ సావిత్రికీ ఇదివరకే పరిచయం ఉందని తెలియగూడదు. సావిత్రి సాని కొంపల్లోంచి వచ్చిందని అస్సలు తెలియగూడదు.

అందుకే అడిగాను.

"డబ్బా అవి మాట్లాడుకున్నారుటే."

"ఆఁ అన్నీ అయినయ్. ఎంతో కొంత ఇవ్వండమ్మా అంది. చాలా అణకువగా కనిపిస్తోందిరా. నాన్న వచ్చేసరికి నాతో పని విషయం మాట్లాడుతోంది. ఆయనకు దారి ఇచ్చి ఎంత సిగ్గు పడిందనీ" అంటూ అమ్మ వెళ్ళిపోయింది.

నాలో నేను నవ్వుకున్నాను.

సావిత్రిని సాధ్యమైనంతవరకు తప్పుకు తిరుగుతున్నాను. సావిత్రిని నేను చూపిన చోటు వేరు. ఇప్పుడు చూస్తున్న చోటు వేరు.

ఓ రోజున యాధాలాపంగా సావిత్రి వంక చూశాను. సావిత్రి మెళ్లో మంగళ సూత్రం కనిపించింది. "సావిత్రికి పెళ్ళయిందా" అనుకున్నాను.

ఆ విషయమే అమ్మ నడిగాను.

"అయిందటరా, దాని మావ నైజాం పోయాట్ట. "సరిగ్గా ఇల్లుగూడ లేదం డమ్మా, మీ పంచనే పడుకోనియ్యండి" అంది. సరే అని వరండా గదిలో పడుకో మన్నాను." అంటూ చెప్పింది అమ్మ.

"ఇది ఎంతవరకు నిజం?" అనుకున్నాను.

ఉండబట్టలేక ఇంకోసారి సావిత్రి నడిగాను.

సావిత్రి చెప్పిన సమాధానం వేరు.

"బాబూ, మీరు నాకు దారి చూపిన వాళ్ళు మీరు అడిగారు కాబట్టి చెబుతున్నా. మా ఇళ్ళ ఇంకా మా ఇళ్ళేంది సాని కొంపల కొచ్చే రసిక మహారాజులు కొందరికి పెళ్ళయిన ఆడోళ్ళంటే యిష్టం ఉంటుంది వాళ్ళ కదో పిచ్చి. ఎవడి పిచ్చి వాడి కానందం. అందుకోసం 'మంగళ సూత్రం' పేని కట్టుకున్నాను. అంతే బాబూ నాకు పెళ్ళీ కాలా మావా లేడు. అమ్మగారి కలా చెప్పాను." సావిత్రి ఆగింది.

"ఉష్, బిగ్గరగా అనకు. అమ్మ వింటుంది" అన్నాన్నేను.

"అమ్మగారు చాలా మంచివారు బాబూ."

"సావిత్రీ" అని పిలిచింది అమ్మ లోపలినుండి

సావిత్రి వెళ్ళిపోయింది.

"ఏమోలే, ఒక అభాగిని జీవితాన్ని గట్టెక్కించాను" అనుకున్నాను భారంగా.

సావిత్రి పనిమనిషిగా చేరి దాదాపు ఇరవై రోజు లవుతోంది. అందరికీ తల్లో నాలుకలా అందరి పనులూ చేస్తూ మా ఇంట్లో అందరి మెప్పు పొందింది.

ఆ రోజున రాత్రి పదిగంటల సమయం.

నేను బయటనుంచీ వస్తున్నాను. గేటు దాటాక ఎవరో నన్ను గాఢంగా కౌగలించు కున్నారు.

చూస్తే సావిత్రి!!

నేను గబుక్కున విదిలించుకుని చుట్టు పక్కలా చూశాను. అమ్మయ్య! ఎవరూ లేరు!!

సావిత్రి తల వంచుకుని కొద్దిదూరంలో నుంచుంది.

"ఇదేం పని సావిత్రీ" అని అడిగాను మెల్లగా.

"నన్ను క్షమించండి బాబూ, ఉద్రేకంలో మిమ్మల్నిలా చేశాను. ఆ రకపు జీవితాని కలవాటు పడ్డవాళ్ళు ఇంకోరకపు జీవితాని కతకరు బాబూ. నేనెంత ప్రయత్నించినా ఆపుకోలేక పోయాను. ఇవాళ చాలా చెడ్డరోజు. అదోరంగు జీవితం. సాయింత్రం ఐదయ్యే సరికల్లా ముస్తాబు చేసుకుని బయట కూనిరాగాలుతీస్తూ, వచ్చేపోయే పాసింజర్లని పిలుచుకుంటూ, నాంచారయ్య కాకాహోటల్లో టీనీళ్ళు తాగుతూ, ఉన్నరోజున తిని, లేనిరోజున

వస్తుండే జీవితాని కతికిపోయాను. ఎంత ప్రయత్నించినా మారటం నావల్ల కాలేక పోయింది. ముందు మీరు నన్ను అడిగి నప్పుడు ఎంత సంతోషించానో ` ఎందు కులేబాబూ...అదో రొంపి...మురికి కూపం. దాంట్లోంచి బయటకు రావడమే కష్టం. వచ్చినా బయట బతకటం చాలాకష్టం మీలాంటివాళ్ళ చేయూత నిస్తానన్నా ఆ చేయి పట్టుకునేపాటి అదృష్టం ఉండొద్దు. అవన్నీ మీకు చెప్పి విసిగించను బాబూ. రేపు అమ్మ గారితో చెప్పి వెళ్ళిపోతాను.'' అంటూ సావిత్రి అక్కడనుంచి వెళ్ళిపోయింది.

నిముషం సేపు అలాగే ఉండిపోయాను.

అవును మురికి కూపంలో మగ్గు తున్నవాళ్ళు సెంటువాసన ఎలా భరించ గలరు? పాసింజర్లని పిలుచుకుంటూ టీనీళ్ళు తాగుతుందిట, పోనీ పొమ్మను. ఏమిటి దానికీ నాకూ సంబంధం? ఇంకా అల్లరి చేయకుండానే వదిలిందిలే...దాని చావు అదే చస్తుంది అనుకున్నాను కసిగా.

కసి!

ఎవరిమీద? ఏదో అర్థంలేనికసి! నేనేదో మార్గం చూపాను. అది నచ్చలేదు వెళ్ళి పోతోంది నాకెందుకు కసి?అప్పట్లో అంత వివేకంగా ఆలోచించ లేక పోయాను.

మర్నాడు ''ఒరేయ్, లే. ఎవరిపనులు వాళ్ళు చేసుకోవాలి. సావిత్రి పనిమానుకొని వెళ్ళిపోయింది'' అంటూ లేపింది అమ్మ.

''ఆఁ సావిత్రి వెళ్ళిపోయిందా?'' ఆశ్చర్యం నటిస్తూ అడిగాను. అవును, అమ్మకు తెలియగూడదు మరి!

''దాని మావ వచ్చి నైజాం తీసికెడతా నన్నాడట. అందుకని మానుకుని వెళ్ళిపో యింది. వెళ్ళేటప్పుడు ఎంత బాధ పడుతూ వెళ్ళిందనీ'' అంటూ ఏవో చెప్తోంది అమ్మ

నేనవి వినిపించు కోవటంలేదు.

''మావ పిలవలా, మావలు పిలిచారు. నైజాంకాదు, దానిశ్రాద్ధానికి'' అనుకున్నాను మళ్ళీ ''కసి''గా.

చీకటి వెనక వెలుగు, వెలుగు వెనక చీకటి వస్తాయి ఈ చీకటికి మాత్రం వెలుగు లేదా? ★

